క్లుప్తంగా

అభ్యర్థుల ఖర్చుల వివరాల రిజిస్టర్ల పరిశీలన



నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు తప్పని సరిగా ఖర్చుల రిజిస్టర్లు పక్కాగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల కమిషన్ గుంటూరు తూర్పు, పశ్చిమ, తాడికొండ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు వినోద్ కుమార్ చంద్రవన్ కోరారు. బుధవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గుంటూరు తూర్పు, పశ్చిమ రిటర్నింగ్ అధికారులు కీర్తి చేకూరి, కె.రాజ్యలక్ష్మిలతో కలసి పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల వ్యయ విధానంపై వివరించి, అభ్యర్థుల వ్యయ రిజిస్టర్లను పరిశీలించారు.

శ్రీకృష్ణలీలలు ధారావాహిక ప్రవచనాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న శ్రీ మద్భాగవతం-దశమస్కంధం- శ్రీకృష్ణలీలలు ధారావాహిక ప్రవచనం బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఆలయ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.

సీనియర్ గాయనికి సన్మానం



నగరంపాలెం: సుప్రసిద్ధ సినీ గాయని జానకి జన్మదినం సందర్భంగా అమరావతి రోడ్ పోస్టల్‌కాలనీలోని శ్రీ శుభాంజలి కళావేదిక కార్యాలయంలో బుధవారం సీనియర్ గాయని నిర్మలను సత్కరించారు. ఆమె ఆలపించిన పలు గీతాలు పాడారు. కార్యక్రమంలో అధ్యక్షులు మేకల పురుషోత్తమప్రసాద్, కళాసౌధ అధ్యక్షులు బిళ్లా అశోక్, విద్యా శాఖ ఏడీ రాసంశెట్టి నరసింహారావు, గాయకులు శెట్టి థామస్, చాంద్‌బాబు, కళా సంఘం అధ్యక్షులు బాలస్వామి, రాజశేఖర్, చిలకా సుబ్బారావు పాల్గొన్నారు.

బైకును ఢీ కొన్న కారు

భట్టిప్రోలు: హైవేపై అతి వేగంగా వస్తున్న కారు జంక్షన్ వద్ద బైక్‌ను ఢీ కొట్టిన ఘటన స్థానికంగా చోటు చేసుకుంది.ఈ ప్రమాదంలో ఓ మహిళ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. భీమవరం నుంచి ఒంగోలు వైపుకు వెళుతున్న కారు భట్టిప్రోలు మండలం ఎన్‌హెచ్ 216 మార్గంలో ఓలేరు జంక్షన్ వద్దకు వచ్చేసరికి కొల్లూరు మండలం కిష్కిందపాలెం నుంచి రేపల్లె మండలం నల్లూరుపాలెం వైపు బైక్‌పై వెళుతున్న ముగ్గుర్ని ఢీ కొట్టింది. బైక్‌పై నల్లూరుపాలెంకు చెందిన సృజన్‌బాబు, భార్య, మేనకోడలు ఉన్నారు. ఓలేరు జంక్షన్ వద్దకు వచ్చేసరికి కారు అతి వేగంగా ఢీ కొట్టడంతో బైక్‌పై వెళుతున్న ముగ్గురు స్పృహ తప్పి పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిలో సృజన్ బాబు భార్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది. సమాచారం మేరకు 108 సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరి పరిస్థితి తీవ్ర తరంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్సకు మంగళగిరి ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ కాసుల శ్రీనివాసరావును వివరణ కోరగా ఈ సంఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

గీత కార్మికుడి మృతి

కర్లపాలెం: తాడిచెట్టు ఎక్కుతూ పడి ఓ గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలోని యాజలి గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు యాజలి గొడపాలెంకు చెందిన పొన్నూరు కోటేశ్వరరావు(60) కల్లు గీత కార్మికునిగా జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం కల్లు తీసేందుకు కోటేశ్వరరావు తాడిచెట్టు కొంతదూరం ఎక్కి స్పృహ తప్పి కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు కోటేశ్వరరావును ఓ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్లపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

అధికారం కోసం ఏమైనా చెబుతారు...

- నమ్మారో...నట్టేట ముంచేస్తారు అరచేతిలో స్వర్గం చూపిస్తారు జాగ్రత్త..!
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- గుంటూరు 32, 38 డివిజన్లలో మనతో మన రజినమ్మ కార్యక్రమం
- హాజరైన ఎమ్మెల్యే, పార్టీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్



ప్రచారంలో మంత్రి రజినిపై పూలవర్షం కురిపిస్తున్న అభిమానులు, వాహనంపై ఎమ్మెల్యే గిరిధర్

పట్నంబజారు: నోటికొచ్చినట్లు హామీలిస్తారు.. నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతారు.. అధికారం కోసం అడిగినవి, అడగనివి అన్నీ చేస్తాం.. అంటూ అరచేతిలో స్వర్గం చూపించే నాయకులు మన మధ్యకు వస్తున్నారని, మనమంతా జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని కోరారు. గుంటూరు నగరం 32, 38 డివిజన్లలో బుధవారం మనతో మన రజినమ్మ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు మరోసారి అడ్డగోలు హామీలు ఇచ్చి, మాయమాటలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు అన్నీ తెలుసని, చంద్రబాబుకు ఓట్లేస్తే నట్టేట ముంచుతారనే అవగాహన ప్రతి ఒక్కరికి ఉందని చెప్పారు. ప్రజల్లో నమ్మకం కోల్పోయిన వారంతా కూటములు కట్టి ఏదో రకంగా గెలవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఎంత మంది కలిసినా శూన్యమే

విశ్వసనీయత లేని నాయకులు ఎంతమంది కలిసినా ఫలితం శూన్యమని మంత్రి విడదల రజిని విమర్శించారు. విశ్వసనీయతకు మారుపేరైన జగనన్న వైపే ప్రజలు ఉన్నారని పేర్కొన్నారు. ప్రజాభిప్రాయం స్పష్టంగా కనపడుతున్నందునే సహనం కోల్పోయి చంద్రబాబు సీఎం జగన్‌పై ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అది ఆయన వయసుకు, రాజకీయ అనుభవానికి కూడా తగని పని అని హితవుపలికారు. రాష్ట్రంలో ఫ్యాను గాలి వీస్తోందని, ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోసారి ప్రభంజనం సృష్టించనుందన్నారు. గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యేగా తనకు, గుంటూరు ఎంపీగా పోటీ చేస్తున్న కిలారి రోశయ్యకు ఫ్యాను గుర్తు మీద ఓట్లు వేసి గెలిపించవలసిందిగా కోరారు.



మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి రజిని, ఎమ్మెల్యే గిరి తదితరులు

వైఎస్సార్ సీపీ హయాంలోనే అభివృద్ధి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గుంటూరు నగరాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే, పార్టీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్ చెప్పారు. చేసేది చెప్పడం... చెప్పిందే చేయడం జగనన్న నైజమని పేర్కొన్నారు. అబద్ధాలు చెప్పి మాట తప్పడం చంద్రబాబునాయుడికి అలవాటని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 99శాతం హామీలు అమలు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతోందన్నారు. తొలుత మంత్రి రజిని బ్రాడీపేట 6/18 లైను నుంచి బయలుదేరి ఎల్ఈఎం స్కూలు మీదుగా, 6/12, 6/13, 6/14, 6/15 లైన్‌ల మీదుగా ఉడా పార్కు వరకు పర్యటించారు. అనంతరం అక్కడి ప్రజల నుద్దేశించి స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. సాయంత్రం జరిగిన ఎన్నికల ప్రచారంలో గుజ్జనగుండ్ల సెంటర్, ఎల్ఐసీ కాలనీ తదితర ప్రాంతాల్లో మంత్రి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో 32వ డివిజన్ కార్పొరేటర్ ఆచారి, డివిజన్ అధ్యక్షుడు రత్నప్రసాద్ వైఎస్సార్ సీపీ నాయకుడు జ్వాలా నరసింహారావు, 36వ వార్డు అధ్యక్షుడు బొగిశం ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం

నెహ్రూనగర్: అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డీబీఆర్‌సీ(దళిత బహుజన రిసోర్స్ సెంటర్), ఇండియా లేబర్ లైన్ ఆధ్వర్యంలో లాడ్జిసెంటర్‌లో అసంఘటిత రంగ కార్మికులకు, కార్మికులకు కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లేబర్ లైన్ స్టేట్ కో ఆర్డినేటర్ మాధవరావు మాట్లాడుతూ కార్మికులు తప్పనిసరిగా కార్మిక చట్టాలపై అవగహన కలిగి ఉండాలన్నారు. కార్మికులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సురేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భీమ్ భారత్ ఆధ్వర్యంలో..

సాంస్కృతిక అణిచివేతలకు అవమానాలకు గురవుతున్న దళిత బహుజన కార్మిక వర్గాలను చైతన్య పరిచేందుకు సామాజిక విప్లవ మూర్తులు మేఘాజీ లో ఖాండే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌లను ఆదర్శంగా తీసుకోవాలని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ తెలియజేశారు. అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో మే డే నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దొడ్డ రాజేంద్రప్రసాద్, అంకయ్య, బాజీ, భాగ్యరాజు పాల్గొన్నారు.



లాడ్జిసెంటర్‌లో కార్మికులకు కార్మిక చట్టాలపై అవగహన కల్పిస్తున్న డీబీఆర్‌సీ, లేబర్ లైన్ ప్రతినిధులు

కార్మికుల సేవలు వెలకట్టలేనివి

కార్మికుల సేవలు వెలకట్టలేనివని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు మాదిగ తెలిపారు. నగరంలోని సంఘ కార్యాలయంలో మేడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపరీతంగా పెరిగిన ధరలు కార్మికుల కడుపు నిండనివ్వడం లేదన్నారు. కార్మిక, కర్షక దోపిడీ యథేచ్ఛగా జరుగుతూనే ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల జీవన ప్రమాణాలు పెంచే విధంగా తగిన కృషి చేయాలని కోరారు.

ఐక్య ఉద్యమాలతోనే హక్కుల పరిరక్షణ

ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఐక్య ఉద్యమాలతోనే హక్కులను పరిరక్షించుకోగలమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద మే డే నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ కార్మికులు, శ్రామికుల్లో చైతన్యం పెంపొందడంతో పాటు ఐక్యత అవసరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. రాజ్యాంగ వ్యతిరేక శక్తుల్ని ఓడించడమే ధ్యేయంగా శ్రామిక వర్గం పనిచేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమన్నారు. హక్కులు లేని కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాలు అంటే శ్రమ దోపిడీకి ఆధునిక మార్గం అన్నారు. శ్రామికులందరికీ ఎర్ర జెండాయే అండ అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏఎల్ శివ పార్వతి, జిల్లా కార్యదర్శి ఎం.గోవిందు, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం. కోటిరెడ్డి, పి.ప్రేమ్ కుమార్, ఎండీ షకీలా బేగం, ఎం.ధన రాజారావు, అంకమ్మరావు, నాగమణి, బురాన్, ప్రసాద్, శ్రీనివాసరావు, నరసింహారావు పాల్గొన్నారు

మే డే ఒక చారిత్రాత్మక చైతన్య దినం

లక్ష్మీపురం: మేడే ఒక చారిత్రత్మక చైతన్యదినమని సీనియర్ ఇంజినీర్ ఎస్.సదాశివం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం మేడే సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విశ్లేషకులు ఆర్.వి. సింగరయ్య, సంస్థ సీనియర్ సభ్యులు పూర్ణచంద్రరావు, జనార్ధనరావు పాల్గొన్నారు.

కార్మిక వర్గ పోరాటాలకు ప్రతీక మే డే

లక్ష్మీపురం: కులాలకు మతాలకు అతీతంగా ప్రపంచ కార్మిక వర్గం యావత్తు నిర్వహించుకునే అతిపెద్ద పండుగ మే డే అని సీపీఐ నాయకుడు ఆకిటి అరుణ్ కుమార్ అన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లోని 33,34వ డివిజన్ కార్యదర్శి రామచంద్రుడు ఆధ్వర్యంలో మే డే బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు.



యూటీఎఫ్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ ఇంజనీర్ ఎస్.సదాశివం



భోజనపు సంచులు అందజేత

కార్మికులకు వెంకయ్య సేవలు మరువలేనివి

నగరంపాలెం: గతంలో మిర్చియార్డులో అనేక మంది కార్మికులకు దివంగత గరిగంటి వెంకయ్య జీవనోపాధి కల్పించారని మిర్చి వ్యాపారి, కాంగ్రెస్ సీనియర్ నేత గరిగంటి వెంకటేశ్వర్లు అన్నారు. మిర్చి కార్మిక నేత వెంకయ్య వర్ధంతి సందర్భంగా బుధవారం జిన్నాటవర్ కూడలిలోని పలువురు పేదలకు ఉచితంగా భోజనపు పొట్లాలను అందించారు.

వావిలాల గోపాలకృష్ణయ్య చిరస్మరణీయుడు

లక్ష్మీపురం: నిస్వార్థ ప్రజా సేవకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన వావిలాల గోపాలకృష్ణయ్య నమ్మిన విలువల, విశ్వాసాల కోసం కడదాకా పోరాడినట్లు అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం వావిలాల గోపాల కృష్ణయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వావిలాల తన చివరి క్షణం వరకు తెలుగువారి కోసం, తెలుగు భాష అభ్యున్నతి కోసం అహర్నిశలు పోరాడిన యోధుడు, గొప్ప మానవతావాది అన్నారు. ప్రజా సమస్యలపై అలుపెరుగకుండా ఎనిమిది దశాబ్దాల పాటు అవిశ్రాంత పోరాటం జరిపిన మహోన్నత గాంధేయవాది అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో అనేక ఉద్యమాల్లో పాల్గొని 14 సార్లు అరెస్టయి, ఏడు సార్లు కఠిన కారాగార శిక్ష అనుభవించారని గుర్తు చేశారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత గైడెన్స్

గుంటూరు ఎడ్యుకేషన్: టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులకు ఐఐటీ, నీట్ పరీక్షలకు ఉచిత గైడెన్స్ ఇవ్వనున్నట్లు మెటామైండ్ అకాడమి చైర్మన్ ఎ. మనోజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఐఐటీయన్లు, డాక్టర్లతో విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఉచిత గైడెన్స్ పొందవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 9090898928, 9090898902 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

పట్నంబజారు: ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయటంతో పాటు కేసు నమోదు చేశారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. గత నెల 28వ తేదీన సాయంత్రం లాంఛెస్టర్ రోడ్డులో నిర్వహించిన టీడీపీ సభలో పల్నాడు జిల్లాలో పనిచేసే హెడ్‌కానిస్టేబుల్ కాకుమాను శ్రీనివాసరావు స్టేజీపైకి ఎక్కి రాజకీయ పార్టీ గురించి వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో దీనిపై ఎంసీసీ టీం- 3 మెంబర్ సిహెచ్.భరత్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావుపై ఎన్నికల నియామవళిని అతిక్రమించిన నేపథ్యంలో కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు. సదరు హెడ్‌కానిస్టేబుల్ పల్నాడు జిల్లా ఎస్పీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బాలికపై లైంగిక దాడి

భట్టిప్రోలు: ఐదేళ్ల బాలికపై 13 ఏళ్ల బాలుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన మండలంలోని పెద పులివర్రులో చోటు చేసుకుంది. ఎస్ఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్‌పై నివాసం ఉంటున్న ఐదేళ్ల బాలికను పక్కనే నివసిస్తున్న 13 ఏళ్ల బాలుడు మంగళవారం లైంగిక దాడికి పాల్పడ్డాడు. రాత్రి స్నానాల గదిలోకి తీసుకువెళ్లి బాలికపై బాలుడు లైంగిక దాడి చేశాడని తల్లి తిరుపతమ్మ ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. రేపల్లె డీఎస్పీ విచారణ అనంతరం వైద్య పరీక్షల కోసం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

రైతు ఉసురు తీసిన అప్పులు

బొల్లాపల్లి: అప్పుల బాధ తాళలేక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన సంఘటన మండలంలోని పేరూరుపాడు గ్రామంలో జరిగింది. బండ్లమోటు ఎస్సై డి.చెన్నకెశవులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుర్రం చినకోటయ్య (42) ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు చెసుకుని మృతి చెందాడు. తనకున్న అర ఎకరం స్వంత పొలంతో పాటు మరో ఐదేకరాలు పొలం కౌలుకు తీసుకుని గత రెండేళ్లగా మిరప, వరి వగైరా పంటలు సాగు చేస్తున్నాడు. గత రేండేళ్లుగా పంటలు పండక అప్పులు తీరక ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెంది కుటుంబసభ్యుల పొలం వెళ్లిన సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందారు. మృతునికి భార్య పద్మ ఇరువురు సంతానం ఉన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అందజేశారు.

లారీ ఢీకొని ట్రాక్టరు డ్రైవరు మృతి



మృతి చెందిన కరిముల్లా

శావల్యాపురం:గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో వేగంతో వస్తున్న లారీ, ట్రాక్టరును ఢీకొన్న సంఘటనలో ట్రాక్టరు డ్రైవరు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్సై చల్లా సురేష్ కథనం ప్రకారం.. పొన్నూరు మండలం దొప్పలపూడి గ్రామానికి చెందిన షేక్ కరిముల్లా (34) గుంటూరులో సోనాలిక ట్రాక్టరు కంపెనీలో డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కొత్త ట్రాక్టరు డెలివరీ ఇచ్చేందుకు మంగళవారం అర్ధరాత్రి గుంటూరు నుంచి కర్నూలు బయలుదేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యంలో శావల్యాపురం సబ్‌స్టేషను వద్ద గుంటూరు నుంచి వస్తున్న లారీ అదుపుతప్పి వెనుక నుంచి ట్రాక్టరును ఢీకొంది. ఈక్రమంలో ట్రాక్టరు బోల్తా పడటంతో డ్రైవరు కరిముల్లా రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి.108 అత్యవసర వాహనం ద్వారా క్షతగాత్రుడిని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కరిముల్లా మృతి చెందినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ర్యాండమైజేషన్ ఈవీఎంలు కేటాయింపు



కేంద్ర ఎన్నికల పరిశీలకులు కార్తీకతో మాట్లాడుతున్న పశ్చిమ ఆర్ఓ రాజ్యలక్ష్మి

నెహ్రూనగర్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పోలింగ్ కేంద్రాలకు ర్యాండమైజేషన్ ద్వారా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈవీఎంల కేటాయించనున్నట్లు పశ్చిమ ఆర్ఓ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులు ఎస్.పి.కార్తీక, పశ్చిమ నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థుల సమక్షంలో ఈవీఎంల ర్యాండమైజేషన్‌ని నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి ఛాంబర్‌లో బుధవారం చేపట్టారు. ఆర్ఓ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 291 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల బ్యాలెట్ యూనిట్ల కేటాయింపునకు ఈవీఎం మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించామన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల సమక్షంలో జరిగిన ర్యాండమైజేషన్ లిస్టు మేరకు మే 13 జరిగే ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలను వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తింపు కార్డులు అందిస్తామని తెలిపారు. హోం ఓటింగ్‌కి సంబంధించి రూట్ మ్యాప్‌ని పోటీలో ఉన్న అభ్యర్థులకు అందిస్తామని, హోం ఓటింగ్ పరిశీలనకు అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లు ఉండవచ్చని, అందుకు అవసరమైన వివరాలు ఇస్తే గుర్తింపు కార్డ్‌లు అందిస్తామన్నారు. అభ్యర్థులు, అధికారులతో కలసి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశామని, గ్రూప్‌లో ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారం పోస్ట్ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ఓలు సీ.హెచ్ శ్రీనివాసరావు, సీనారెడ్డి, సూపరింటెండెంట్‌లు పద్మ, వెంకట రామయ్య పాల్గొన్నారు.

జీజీహెచ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో పని చేసే నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో బుధవారం పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాజువాల్టీ సమీపంలో రూ.3 లక్షల వ్యయంతో నిర్మించిన డ్రెస్సింగ్ రూమ్ తాళాలను సిబ్బందికి అందచేశారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలోని వైద్యులకు, వైద్య సిబ్బంది టాయిలెట్స్ లేకపోవడంతో రూ.20 లక్షలతో బడ్జెట్ కేటాయించామన్నారు.

24 గంటలూ అందుబాటులో ఆల్ట్రాసౌండ్ పరికరం

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో అత్యవసర చికిత్స విభాగానికి అల్ట్రా సౌండ్ పరికరాన్ని 24 గంటల పాటు అందుబాటులో ఉంచుతున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం క్యాజువాల్టీలో రూ.12 లక్షలతో అల్ట్రా సౌండ్ పరికరాన్ని లాంఛనంగా బుధవారం ప్రారంభించారు.

కేఎల్‌యూ అధ్యాపకులకు పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న అధ్యాపకులతో వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వ విద్యాలయంలో నలుగురు మహిళా అధ్యాపకులకు ఇన్‌స్పైరింగ్ ఉమెన్ అవార్డులు లభించినట్లు విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫోర్త్ స్క్రీన్ ఎడ్యుకేషన్ అనే సంస్థ తమ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న నలుగురు మహిళా అధ్యాపకులకు ఇన్‌స్పైరింగ్ ఉమెన్ అవార్డులను అందజేసిందని తెలిపారు. ఈ అవార్డులను అందుకున్న వారిలో స్టూడెంట్స్ అఫైర్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య, ఐక్యు ఏసి అసోసియేట్ డీన్ డాక్టర్ పి.లక్ష్మి ప్రసన్న, సీఎస్ఈ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.విద్యుల్లత, సీఎస్ఈ ప్రొఫెసర్ డాక్టర్ సాగర ఇమాంబిలకు పరిశోధనలు, అకడమిక్‌ల రంగాలలో కృషి చేసినందుకు ఈ అవార్డులు లభించాయని తెలిపారు. అవార్డులు లభించిన అధ్యాపకులను వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సులర్లు డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు అభినందించారు.

మీకు రోషం లేదా? రోడ్లపైకి రారా?

గుంటూరు ప్రజాగళం సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు

కొరిటెపాడు:మీకు రోషం లేదా? మీరు రోడ్లపైకి రారా అంటూ చంద్రబాబునాయుడు గుంటూరు ప్రజలనుద్దేశించి వ్యాఖ్యలు చేశారు. బుధవారం రాత్రి ఆయన గుంటూరులో రోడ్‌షో అనంతరం జిన్నాటవర్ సెంటర్ వద్ద నిర్వహించిన సభలో మాట్లాడారు. తాను అమరావతి ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతులను రాజధాని నిర్మాణంలో భాగస్వాములను చేస్తే, ఒక్క పిలుపుతో 29 వేల మంది రైతులు 35 వేల ఎకరాలు ఒక్క రూపాయి పెట్టుబడి లేకుండా ఇచ్చారన్నారు. ఆనాడు తాను అమరావతిని ఎంతో అభివృద్ధి చేస్తే, సైకో అన్ని నేనే చేశానంటున్నాడు. ఏం తమ్ముళ్లు మీకు నమ్మకం కలిగిందా.. సమాధానం చెప్పాలి. అమరావతి రాజధాని కావాలా! వద్దా... ! మీకు రోషం ఉందా లేదా.. కోపం ఉందా లేదా... ఉంటే సైకో పార్టీ నుంచి ఎందుకు బయటకు రావడం లేదని అడుగుతున్నా.. గుంటూరులోని ప్రతి ఇంటికి పట్టా ఇస్తాం. ఇంటి జాగా లేని వారికి జాగా ఇస్తాం. టిడ్కో ఇళ్లను పూర్తి చేసి ఉచితంగా లబ్ధిదారులకు ఇస్తాం. గుంటూరులో రోడ్లు బాగున్నాయా అని అడుగుతున్నా. కనీసం గుంటూరు పట్టణంలోనైనా రోడ్లు బాగున్నాయా? గుంటూరు రోడ్లు చాలా విశాలమైన రోడ్లు. వాటిని బాగు చేస్తే గుంటూరు నగరం చాలా సుందర నగరం అవుతుంది. పెమ్మసాని చంద్రశేఖర్ అమెరికా వెళ్లి బ్రహ్మాండంగా సంపాదించి పుట్టినగడ్డ రుణం తీర్చుకోవాలని ఇక్కడకు వచ్చాడు. ఇలాంటి వారు కొన్ని వందలు, వేల మంది విదేశాలు వెళ్లారు. చంద్రశేఖర్‌లా మీరు అమెరికా వెళ్లాల్సిన అవసరం లేకుండా అక్కడ కంపెనీలతో ఇక్కడ నుంచే వ్యాపారం చేసేలా చూస్తాం.

కొల్లూరు వైద్యాధికారిపై చర్యలకు డిమాండు

కొల్లూరు: రోగుల నాడి పట్టి వైద్యసేవలు అందించాల్సిన వైద్యాధికారి అకృత్యాలు రోజురోజుకు శృతిమించడంతో సిబ్బంది అధికారులకు ఫిర్యాదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పలువురు వైద్యశాల సిబ్బంది అందించిన సమాచారం మేరకు.. కొల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా సేవలు అందించాల్సిన దావులూరి రవిబాబు రోగులను పరీక్షించే విషయాన్ని గాలికి వదిలి వైద్యశాలలోనే మద్యపానం చేస్తూ సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైద్యశాలలోని స్టోర్ రూమ్‌ను మద్యపాన శాలగా మార్చిన వైద్యాధికారి రవిబాబు మద్యం సేవిస్తూ, మహిళా సిబ్బందిని లైంగికంగా వేధిస్తుండటంతో సహనం కోల్పోయిన సిబ్బంది జిల్లా అధికారుల నుంచి మండల అధికారుల వరకు శనివారం ఆధారాలతో కూడిన లిఖిత పూర్వక ఫిర్యాదులను అందజేశారు. సిబ్బంది చేసిన ఫిర్యాదు మేరకు.. కొల్లూరులోని ఓ సచివాలయంలో ఇన్‌చార్జి ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న మహిళా ఏఎన్‌ఎంను వైద్యాధికారి రవిబాబు కొద్ది రోజులుగా మద్యం సేవిస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడు. వైద్యశాలలోని గదిలో మద్యంలో మునిగితేలుతున్న వైద్యాధికారి మహిళా ఏఎన్‌ఎంను గదిలోకి రావాలని సతాయించడం, ఆవిడ సెల్ ఫోన్‌కు అసభ్య పదజాలంతో కూడిన మెసేజ్‌లు పంపడం చేస్తున్నాడు. ఆయన చర్యలను సహనంగా భరిస్తూ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న ఆవిడను తన గదిలోకి తీసుకువస్తేనే భోజనం చేస్తానని మరో మహిళా ఏఎన్‌ఎం వద్ద ప్రస్తావించడంతో ఆ ఏఎన్‌ఎం, బాధిత ఏఎన్‌ఎం, సీహెచ్ఓగా విధులు నిర్వహిస్తున్న మరో ఉద్యోగిని వైద్యాధికారి మద్యం సేవిస్తున్న గది వద్దకు వెళ్లారు. బాధిత ఏఎన్‌ఎంతో వెళ్లిన మహిళా ఉద్యోగులపై వైద్యాధికారి ఉగ్రరూపం ప్రదర్శించి వారిని బయటకు వెళ్లగొట్టారు. అప్పటికే మద్యం తాగి ఉన్న వైద్యాధికారి రవిబాబు గదిలో ఉన్న బాధిత ఏఎన్‌ఎంను గది తలుపులు మూసి తన వద్దకు రావాలని బెదిరించడంతో బాధితురాలు అతని బారి నుంచి తప్పించుకొని గది నుంచి బయటపడింది. అక్కడితో ఆగని వైద్యాధికారి బాధిత ఏఎన్‌ఎంతో గది వద్దకు వెళ్లిన సీహెచ్‌ఓకు ఫోన్‌లు చేసి ఆవిడ్ని గదిలోకి తీసుకురావాలని వేధింపులకు గురి చేయడం ప్రారంభించారు. వైద్యాధికారి వేధింపులకు భయపడిన ఏఎన్ఎం విధులకు హాజరవ్వకుడా ఉన్నప్పటికీ సెల్ ఫోన్‌లకు అసభ్య మెసేజ్‌లు పంపుతూ వేధింపులకు గురి చేస్తున్నారు. ఇదే తరహాలోవైద్యశాలలోనే పనిచేస్తున్న మరో మహిళా ఉద్యోగిని నెల రోజులుగా సెలవులో ఉండి విధులలో తిరిగి చేరేందుకు వైద్యాధికారి సంతకం కోసం వెళ్లగా ఆ ఉద్యోగిని అసభ్య పదజాలంతో వేధించసాగాడు. ఆమె సెల్‌ఫోన్‌లకు అసభ్య సందేశాలు పంపడంతో పాటు ఫోన్ చేసి వేధిస్తుండటంతో శనివారం డీఎంఅండ్‌హెచ్ఓతో ఫిర్యాదు అందజేశారు.